ప్రజాశక్తి

గురువారం 27 ఫిబ్రవరి 2025

8 పేజీలు




ఎన్‌టిఆర్



కృష్ణా

నేడు పోలింగ్



- ఎంఎల్‌సి ఎన్నికలకు సర్వం సిద్ధం
- మొత్తం ఓటర్లు 3,47,116 మంది
- పోలింగ్ కేంద్రాలు 483
- 1444 బ్యాలెట్ బాక్సులు తరలింపు
- 24 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు
- భారీ బందోబస్తు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

శాసన మండలి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల నియోజకవర్గానికి గురువారం జరగనున్న పోలింగ్‌లో 3,47,116 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 206456 మంది ఉండగా, మహిళలు 140615 మంది, ఇతరులు 45 మంది ఉన్నారు. ఎన్నికలకు సంబంధించి మొత్తం 483 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం ఆరు జిల్లాల పరిధిలో 33 నియోజకవర్గాలలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఆరు జిల్లాల కలెక్టర్లు జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరించనుండగా ఆరు జిల్లాల డిఆర్‌వోలు కూడా సహాయ రిటర్నింగ్ అధికారులుగా పనిచేస్తారు. మొత్తం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి నియమితులయ్యారు. మొత్తం 21మంది నోడల్ అధికారులను నియమించారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలుకు పర్యవేక్షణ బృందాలను, 24 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఎన్నికలకు పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఎన్నికలకు 1444 బ్యాలెట్ బాక్సులు ద్వారా పోలింగ్ మెటీరియల్‌ను గుంటూరు, నరసరావుపేట, విజయవాడ, మచిలీపట్నం, నూజివీడు కేంద్రాల నుంచి సంబంధిత సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రిని తీసుకువెళ్లారు. ఏలూరు జిల్లా నూజివీడు, కైకలూరుకు నూజివీడు నుంచి సామాగ్రిని తరలించారు. ఓట్ల (మిగతా 2లో)



పోలింగ్ సామాగ్రిని తరలిస్తున్న సిబ్బంది



పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధుల్లో నిమగ్నమైన సిబ్బంది

ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా)

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల ఎన్నికల అధికారులైన ఆయా జిల్లాల కలెక్టర్లు డాక్టర్ జి.లక్ష్మీశ, డికె.బాలాజీ తెలిపారు. విజయవాడలోని సబ్ కలెక్టరేట్లో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి పంపిణీ ప్రక్రియను కలెక్టర్ లక్ష్మీశ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 112 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్ అధికారులకు విజయవాడ, తిరువూరు, నందిగామలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర పోలింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేసినట్లు తెలిపారు. 18 రూట్లలో సిబ్బందిని, మెటీరియల్‌ను తరలించేందుకు వాహనాలు, భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 78,063 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 450 మంది పోలీసు సిబ్బందితో పాటు తక్షణ స్పందన బందాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ కృష్ణాజిల్లా పరిధిలో 63,114 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 35,321 మంది పురుషులు, 27,789 మంది మహిళలు, నలుగురు థర్డ్ జెండర్లు ఉన్నారని తెలిపారు. గుడివాడ రెవెన్యూ (మిగతా 2లో)



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్లు



ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి
విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

వార్త 2లో

ప్రజా బలం ఒకరిది... డబ్బు, అధికార బలం మరొకరిది...

- పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు అనూహ్యంగా పెరిగిన మద్దతు
- ఆలపాటి ఆర్థిక, భూ వివాదాలపై జోరుగా చర్చ

ప్రజాశక్తి-విజయవాడ

ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల్లో ప్రధాన పోటీ పిడిఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు, కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మధ్యే నెలకొంది. అయితే లక్ష్మణరావుకు పట్టభద్రుదల మద్దతు అనూహ్యంగా పెరిగిందనే చర్చ సాగుతోంది. ఆయన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఆలపాటి అనుచరులు చేసిన దుష్ప్రచారం బెడిసికొట్టినట్లు ఓటర్లు భావిస్తున్నారు. ప్రజా సమస్యలపై చర్చకు పెట్టి ప్రచారం చేసుకోకుండా కేవలం లేనిపోని వందంతులు వ్యాపింపచేయడం ద్వారా లక్ష్మణరావును దెబ్బతీయాలనే ఆలపాటి ప్రయత్నాలను మేధావులైన, విజ్ఞులైన పట్టభద్రులు తిప్పికొట్టారనే ప్రచారం సాగుతోంది. ఎన్నికల గడువు దగ్గర పడుతున్న కొద్దీ వాతావరణం మారిపోయిందనే చర్చ గ్రాడ్యుయేట్లలో బహాటంగానే వినిపిస్తోంది. ఆలపాటి వ్యవహారశైలి, ఆర్థిక, భూ వివాదాలు ఆయనకు ప్రతికూలంగా మారినట్లు (మిగతా 2లో)



రెండో రోజూ వంశీ విచారణ

వార్త మెయిన్‌లో

కిటకిటలాడిన శివాలయాలు

మహాశివరాత్రి సందర్భంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో బుధవారం శివాలయాలు కిటకిటలాడాయి. విజయవాడలోని దుర్గాఘాట్‌లో స్నానమాచరించేందుకు అధికసంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. అనంతరం ఇంద్రకీలాద్రిపై గల దుర్గామల్లేశ్వరాస్వామిని, పాత శివాలయాన్ని యాత్రికులు సందర్శించారు. కృష్ణాజిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలు, హంసలదీవి యాత్రికులతో రద్దీగా కనిపించాయి. యనమలకుదురులోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి యాత్రికులు తరలివచ్చారు. శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ప్రభలు ఆకట్టుకున్నాయి.

... వార్తలు లోపలి పేజీల్లో



యనమలకుదురులో ప్రభల సందడి



తోట్లవల్లూరు మండలం ఐలూరులో యాత్రికుల రద్దీ



దుర్గాఘాట్‌లో స్నానమాచరిస్తున్న యాత్రికులు

మొదటిపేజీ తరువాయి

ప్రజా బలం ఒకరిది... డబ్బు, అధికార బలం మరొకరిది...

ప్రచారం జరుగుతోంది. ఓవైపు ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షన్లు, న్యాయవాదులు తదితర 50 సంఘాలకు పైగా మద్దతుతో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిగా బరిలో ఉన్న కెఎస్ లక్ష్మణరావుకు రోజురోజుకు ఓటర్ల మద్దతు పెరిగిందనే పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఏ కార్యాలయానికి, ఏ వీధికి, ఏ పేటకు, ఏ ప్రాంతానికి వెళ్లినా లక్ష్మణరావు... గత 14 ఏళ్ల కాలంలో ప్రజలతో మమేకమైన తీరు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపైనే కాక, విద్యా, వైద్యం, వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలు రైతులు, నిరుద్యోగ సమస్యపై, డ్వాక్రా, ఆశా, అంగన్వాడీ తదితర రంగాల్లో పని చేస్తున్న వారి సమస్యలపై చేసిన శాసన మండలిలోనూ, బయటా చేసిన రాజీలేని పోరాటాలను గ్రాడ్యుయేట్లు మననం చేసుకుంటున్నారు. ముఖ్యంగా లక్ష్మణరావు అధ్యాపకునిగా ఉన్న సమయంలో విద్యనభ్యసించిన విద్యార్థులు, పోటీ పరీక్షలకు ఆయన ద్వారా శిక్షణ పొందిన, ఉద్యోగాలు సాధించిన పట్టభద్రులు తమ 'మస్టారు'ను మరోసారి గెలుపించుకోవాలనే పట్టుదలతో ఉన్నట్లు తెలిసింది. ఆలపాటి ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేసి, పలువురు అధికారులను ప్రలోభాలకు గురిచేస్తున్నారనే చర్చ ఓటర్లలో సాగుతోంది. ఓటర్ల జాబితాల తయారీలో మతలబు, పోలింగ్ నిర్వహణలో కీలకంగా వ్యవహరించే అధికారులపై వత్తిడి తదితర రకాలుగా గెలుపునకు చేస్తున్న ప్రయత్నాల పట్ల ఓటర్లలో రోజురోజుకు వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. డబ్బు, అధికారం తదితర అన్ని రకాల అస్త్రసస్త్రాలను ప్రయోగించి ఆలపాటి ప్రయోగిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఏదిఏమైనా లక్ష్మణరావు ప్రజాబలంతోనూ, ఆలపాటి అర్థ, అంగ, అధికారబలంతోనూ పోటీలో ఉన్నారని చర్చ సాగుతుండగా, మరికొద్ది గంటల్లో ఓట్ల రూపంలో తమ నిర్ణయాన్ని బ్యాలెట్ బాక్సుల్లో వేయడానికి పట్టభద్రులు సన్నద్ధమయ్యారు.

నేడు పోలింగ్

లెక్కింపు వచ్చే నెల 3న గుంటూరు ఎసి కళాశాలలోనే నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా ఓటర్లను చేర్పించడంలో ముందజలో ఉన్న టిడిపి నాయకులు ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలకు ఓటర్లను తీసుకురావడంలో రవాణా సదుపాయాలు కల్పిస్తున్నారు. కర్నాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి ఎక్కువ మంది ఓటర్లు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు రానున్నారు.

ఏర్పాట్లు పూర్తి

డివిజన్లో మొత్తం 18,440 మంది, మచిలీపట్నం డివిజన్లో 23,555, ఉయ్యూరు డివిజన్లో 21,119 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 77 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. 42 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 94 మంది ప్రిసైడింగ్ అధికారులు, 92 మంది ఏపీవోలు, 199 మంది ఓపీవోలు ఉన్నారని, వీరితోపాటు 92 మంది మైక్రో అబ్జర్వర్లు కూడా ఉంటారని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు గురువారం సెలవు దినంగా ప్రకటించినట్లు తెలిపారు. ఓటు వేసేటప్పుడు అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో 1, 2, 3 సూచిస్తూ బ్యాలెట్ పేపర్లో నమోదు చేయాలన్నారు. ఓటరు పోలింగ్ స్టేషన్ కు వచ్చేటప్పుడు ఏదైనా గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.



ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి- నందిగామ, వీరులపాడు

ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం మూడు రోజుల పాటు మద్యం అమ్మకాలను పూర్తిగా నిసేధించినా వ్యాపారులు పెడచెవిన పెడుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మండలం దాములూరు కూడలి పరిధిలో మద్యం అమ్మకాలు బ్లాక్‌లో జోరుగా సాగుతున్నాయి. అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ముచేసుకుంటున్నారు. దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి దేవాలయం గుడి సమీపంలో తెల్లవారక ముందు నుంచే నడిరోడ్డుపైనే విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఆలయం చుట్టుపక్కల పటిష్టమైన బందోబస్తు కోసం వందలాది మంది పోలీసులు ఉన్నా కేవలం ట్రాఫిక్ నియంత్రణ కోసమే పనిచేస్తున్నారు తప్ప మద్యం విక్రయాల జోలికి వెళ్లటం లేదు. మద్యం వ్యాపారులు ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారు. నందిగామ నియోజకవర్గ పరిధిలోని మద్యం షాపుల యజమానులు బెల్ట్ షాపులకు ఇబ్బడి ముప్పడిగా మద్యాన్ని సరఫరా చేశారు. దీంతో అన్ని గ్రామాల్లో వీధివీధిన విపరీతంగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. అయినా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోకుండా మామూళ్ల మత్తులో జోగుతున్నారని విమర్శలు వస్తున్నాయి.

వ్యాపారుల నుండి విద్యుత్ సిబ్బంది వసూళ్లు

మరోవైపు కూడలి తిరునాళ్లలో వ్యాపారులకు విద్యుత్ సిబ్బంది 'షాక్' ఇస్తున్నారు. విద్యుత్ సరఫరా కావాలంటే బల్బుకు రూ.600 చొప్పున సిబ్బంది వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నందిగామ, వీరులపాడుల్లో రోడ్ల వెంట మద్యం విక్రయాలు



ఉమ్మడి కృష్ణాలో 1,41,352 మంది ఓటర్లు

• 189 పోలింగ్ కేంద్రాలు • సామాగ్రితో సహా తరలిన సిబ్బంది • 1033 మంది పోలీసులతో బందోబస్తు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఇందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తిచేసింది. ఎన్నికలు సజావుగా జరిగేందుకు విస్తృత ఏర్పాట్లు చేసింది.

కృష్ణాజిల్లాలో 77 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్లలోని పంపిణీ కేంద్రాల నుంచి పోలింగ్ సిబ్బందిని, ఎన్నికల సామాగ్రి (మెటీరియల్)ను ప్రత్యేక బస్సుల ద్వారా బుధవారం తరలించారు. ఎన్‌టిఆర్ జిల్లాలో 102 మంది పోలింగ్ ఆఫీసర్లు, 107 మంది అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, 195 అదనపు పోలింగ్ ఆఫీసర్లు, 93 మంది మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కృష్ణాజిల్లాలోని 77 కేంద్రాల పరిధిలో మొత్తం 63,114 మంది ఓటర్లు ఉండగా, 62,715 మందికి ఓటరు స్లిప్‌లు పంపిణీ చేశారు. స్లిప్‌లు అందని వారు ఆన్‌లైన్లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు చెప్పారు. ఎన్‌టిఆర్ జిల్లాలో 112 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 78,238 మంది ఓటర్లున్నారు. రెండు జిల్లాల్లోని 189 పోలింగ్ కేంద్రాల్లో భద్రతా సిబ్బందిని, వెబ్ కాస్టింగ్, వీడియో గ్రాఫర్లును ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించారు. పోలింగ్ పూర్తయిన వెంటనే పటిష్ట భద్రతతో బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చనున్నారు.

పటిష్ట బందోబస్తు

ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రెండు జిల్లాల్లోనూ 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో నేర చరిత్ర ఉన్న వారిని గుర్తించి బైండవర్ చేశారు. కృష్ణాజిల్లాలో 483, ఎన్‌టిఆర్ జిల్లాలో 450 మంది పోలీస్ సిబ్బందిని ఎన్నికల విధులకు నియమించారు. సర్కిల్‌కు ఒకటి చొప్పున స్ట్రైకింగ్ ఫోర్స్, సబ్ డివిజన్‌కు ఒకటి స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లు నిరంతరం గస్తీ తిరిగేలా ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్సీ ఓటు ఇలా వేద్దాం..!

ఓటు ఎలా వేయాలి	ఎలా వేయకూడదు.
మీకు ఇచ్చిన బ్యాలెట్ పేపర్ మీద అభ్యర్థుల పేర్లు మరియు ఫోటోస్ ఉంటాయి.	మీ సొంత పెన్ వాడకూడదు.
మీరు మొదట ప్రాధాన్యం ఇచ్చే వారికి ఎదురుగా ఉన్న బాక్సులో 1వ నెంబరు వేయాలి.	అభ్యర్థుల అందరికీ ఒకటే నంబర్ ఇవ్వకూడదు.
ఇతరులకు కూడా మీకు నచ్చిన ప్రాధాన్యత ఓటు కూడా వేయవచ్చు.	ఒకటి అని రాయకూడదు. ఇంగ్లీష్లులో కూడా వన్ అని రాయకూడదు. అంకెలోనే రాయాలి. ఉదాహరణకు 1
పోలింగ్ కేంద్రాల్లో ఇచ్చే పెన్ మాత్రమే వాడాలి. సొంత పెన్ వాడకూడదు.	బ్యాలెట్ పేపర్‌లో ఎక్కువ పేర్లు ఉంటాయి. ఆపేర్లలో మీకు నచ్చిన వారికి 1వ నెంబర్ వెయ్యాలి.
వెళ్ళేటపుడు మీ ఐడీ ప్రూఫ్ తీసుకొని వెళ్ళాలి. ఎలక్షన్ కమీషన్ నిర్ణయించే ఐడి ప్రూఫ్స్ మాత్రమే.	బ్యాలెట్ పేపర్ వారు చెప్పే పద్ధతుల్లో ఫోల్డ్ చేసి వేయకపోతే ఇన్‌వాలిడ్‌గా తీసుకుంటారు.
బూత్ లోపలకు వెళ్ళే ముందు మీ పేరు చూసుకొని సంతకం పెట్టాలి.	ఖాళీగా పేపర్ వేయరాదు.
బూత్ బయట ఓటర్ లిస్టులో మీ పేరు మరియు క్రమ సంఖ్య చూసుకోండి.	మీరు ఇచ్చే నంబర్స్ గట్టిగా పెన్‌తో రుద్దకూడదు.
	అభ్యర్థి పేరు మురియు బాక్స్ ప్రక్కన కాకుండా మే ఇతర ప్రదేశాలలో వేసినా ఓటు చెల్లదు.
	మీరు ఇచ్చిన బ్యాలెట్ పేపర్ నందు 1 ప్రాధాన్యత ఓటు వేయకుండా మిగతా నంబర్స్ వేస్తే ఓట్ చెల్లదు.

దోమల నివారణకు ప్రత్యేక డ్రోన్లు : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరంలో ప్రజలు దోమల వల్ల అనారోగ్యం పాలవకుండా ఉండేందుకు, విస్తతంగా యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టడానికి 17 లక్షల రూపాయిల వ్యయంతో రెండు మలేరియా స్ప్రింగ్ డ్రోన్ లు కొనుగోలు చేసి బుధవారం రామకృష్ణపురం బుడమేర కాలువలో నందు ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న దోమల సమస్యలను అరికట్టేందుకు, ప్రజలు దోమల కాటు వల్ల అనారోగ్య పారిన పడకుండా ఒక వైపు యాంటీ లార్వే మలేరియా ఆపరేషన్స్ చేస్తున్నప్పటికీ, వరదల తర్వాత ఇప్పుడు మీరు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నప్పటికీ, నిల్వ ఉన్న నీళ్లలో దోమలు ఉత్పత్తి చెందకుండా ఉండేందుకు విజయవాడ నగర పాలక సంస్థ రెండు డ్రోన్లను వాటి ద్వారా నిరంతరంగా ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేస్తూ దోమల ఉత్పత్తి లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బుడమేరు వరదల తర్వాత ఖాళీ స్థలాలలో బుడమేరు కాలువలో దోమల ఉత్పత్తి ఎక్కువైందని అందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఇంకాను దోమల సమస్యలు ఉన్నందున, ప్రజలు దోమల కాటు వల్ల అనారోగ్య బారిన పడకుండా ఉండేందుకు, నగరపాలక సంస్థ ఇప్పుడు స్వయంగా రెండు డ్రోన్లు కొనుగోలు చేయడం వల్ల యుద్ధ ప్రాతిపదికన దోమల సమస్యలు నివారించేందుకు స్ప్రే చేపడుతున్నారని తెలిపారు.



కోడ్ అమలులో ఉన్నా

జోరుగా మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలో బుధవారం మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. బాటిల్ పై 50 నుండి 100 రూపాయలు అదనంగా వసూలు చేశారు. ఎందుకంటే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో షాపులు మూసివేయడంతో బెల్ట్ షాపుల్లో జోరుగా అమ్మకాలు సాగుతున్నాయి. ఈ షాపులకు మద్యం ఎక్కడ నుంచి వస్తుందనేది ఎక్సైజ్ అధికారులు, వైన్ షాపుల యజమానులు చెప్పాలని మహిళలు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో 23 వరకు మద్యం దుకాణాలు ఉన్నాయి. పోలీస్ స్టేషన్లలో అధికారులు, ఇబ్బంది శివాలయాల్లో బందోబస్తు డ్యూటీలకు వెళ్లిపోయారు. ఇక బెల్ట్ షాపుల నిర్వాహకులు తెగబడ్డారు. విచ్చలవిడిగా మద్యం అమ్ముకొని జేబులు నింపుకుంటున్నారు. కొంతమంది వ్యక్తులు ముందుగానే స్టాక్ పెట్టుకొని దర్జాగా అమ్ముకుంటున్నారని తెలుస్తుంది. దీని వెనుక షాపుల్లో పనిచేసే ఉద్యోగుల పాత్ర ఉందని అంటున్నారు. ఎంఎల్‌సి ఎన్నికలు సందర్భంగా మంగళవారం సాయంత్రం మద్యం దుకాణాలకు సీలు వేశారు. కానీ మూసివేసిన మద్యం దుకాణాల్లో సరుకు జోరుగా బెల్ట్ షాపులకు చేరింది. కొత్త కొత్త తరహాలో బెల్ట్ షాపులు నడుపుతున్నారు.



'రంగా' అనుమతి ఉంటే ఇబ్బంది లేదా..?

నియోజకవర్గంలో బెల్ట్‌షాపులు నిర్వహించాలి అంటే రంగా అనుమతి తప్పని సరి చెప్తున్నారు. తనకు ఇవ్వాల్సిన మమ్ములు ఇచ్చి నువ్వు ఎప్పుడు ఐనా? ఎక్కడ ఐనా అక్రమంగా మద్యం బెల్ట్ అమ్ముకోవచ్చు అన్న మాట వినిపిస్తుంది. అసలు ఎవరు ఈ రంగుల రంగా ?ఎందుకు ఈయనకి అంత పవర్ ? ఎక్సైజ్ శాఖలో ఇతనికి అంత బలం ఎక్కడిదనే చర్చ సాగుతోంది. అధికారులకు తెలిసే ఈ తతగం జరుగుతుందనే విమర్శ ఉంది. విచిత్రం ఏమంటే షాపులకు దగ్గరలో బెల్ట్ షాపులు పెట్టి మందు అమ్మడం ఒక తంతు అయితే, ఫోన్ నెంబర్లు ఇచ్చి వారికి ఫోన్ చేయండి మందు మీ దగ్గరకే వస్తుంది అని కొంతమంది చెప్పి వ్యాపారం చేయడం మరొక తంతుగా సాగుతోంది. ఈజీగా డబ్బు సంపాదించుకోవాలనుకున్న వ్యక్తులు ఈ మద్యం విక్రయాలను సాగిస్తున్నారని చెప్పాలి.

పాపారావు మృతికి సంతాపం

ప్రజాశక్తి-అవనిగడ్డ : జనసేన పార్టీ నాగాయలంక మండల ఉపాధ్యక్షులు బోనం పాపారావు(50) మృతి పట్ల అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం పాపారావు మరణ వార్త విన్న బుద్ధ ప్రసాద్ విచారం వ్యక్తం చేస్తూ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే క్రమశిక్షణ కలిగిన నాయకుడు పాపారావు అని కొనియాడారు. ఆయన మతి పట్ల దద్ద ప్రసాద్ తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



అన్నసమారాధన చేస్తున్న దృశ్యం

అన్నసమారాధన


ప్రజాశక్తి ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళంలో ఏకరాతి ప్రసన్న మల్లికార్జున స్వామి వారి దేవాలయంలో ఆలయ కమిటీ, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని రాష్ట్ర తెలుగు యువత నాయకులు, ఎంపిటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొన హరీష్, సుగ్గన పవన్ కుమార్, జీళ్ళ శ్రీనివాస్, నాని, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలుర ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-గన్నవరం : చదువుకున్న పాఠశాలకు సహాయం చేయడమనేది గొప్ప అదష్టమని గొల్లనపల్లి ప్రధాన ఉపాధ్యాయులు కొల్లి సత్య జగదీశ్వరావు అన్నారు. గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల 104 వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమానికి ఆయన అతిధిగా విచ్చేసి ప్రసంగించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు గొట్టం వెంకట రవి అధ్యక్షత వహించారు. కెనరా బ్యాంకు మేనేజర్ వై.యస్.ఆర్ ఆంజనేయులు, గన్నవరం బాలికల ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఝాన్సీ రాణి, పదవి విరమణ చేసిన ప్రధాన ఉపాధ్యాయులు మరియు దాత బొప్పన కోటేశ్వరావు, జవహర్ లాల్, పదవి విరమణ వ్యాయమ అధ్యాపకులు టి.యస్.ఆర్.కే ప్రసాద్, గన్నవరం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే.వి.ఆర్ కిషోర్ తదితరులు మాట్లాడారు.



ఆర్థిక సాయం అందజేత



ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇద్దరు అనారోగ్య బాధితులకు వైద్య ఖర్చులు నిమిత్తం 10 వేలు సాయం, నిరుపేదలు ఐదుగురికి నిత్యావసర సరుకులు బుధవారం అందించారు. సెల్యులాయిడ్స్ వ్యాధితో బాధపడుతున్న కొచ్చర్లకోట వీర రాజ శేఖర్ కు, రూ. 5 వేలు, థైరాయిడ్ కారణంగా ఊబకాయంతో బాధ పడుతున్న పొదిలి రామకష్ణకు రూ. 5 వేలు ఇచ్చారు. అలాగే ఐదుగురు నిరుపేదలకు నెలకు సరిపడ నిత్యావసర వస్తువుల కిట్లను వారి నివాసాలకు తీసుకువెళ్లి అందజేసింది. ఈ కార్యక్రమంలో మానవతా అధ్యక్షులు మడుపల్లి బాలకష్ణ మూర్తి, కార్యదర్శి కర్రా వరప్రసాద్, కోశాధికారి పొట్లూరి రామకష్ణారావు, సంయుక్త కార్యదర్శి వీసం ప్రసాదరావు, ఎగ్జిక్యూటివ్ హెల్త్ మామిడి రాధిక పాల్గొన్నారు

ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం



కోడూరు మండలంలో పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు



గుడ్లవల్లేరు మండలంలో...

ప్రజాశక్తి-కోడూరు : ఎమ్మెల్సీ ఎన్నికలకు కోడూరు మండలంలో పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేసినట్లు తహసీల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. బుధవారం కోడూరు ఇండోర్ స్టేడియం వెనుక, ఉర్దూ స్కూల్, శ్రీ శక్తి భవన్ వద్ద పోలింగ్ కేంద్రాలను కోడూరు ఎస్ ఐ చాణిక్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటికే రౌడీషీటర్లు బైండోవర్ చేసామని ఎన్నికల ప్రవర్తన నియమాలను ఎవరైనా ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** ఈనెల 27వ తేదీ జరగబోయే కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికలకు మెటీరియల్, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు బుధవారం సాయంత్రం చేరుకున్నట్లు తాసిల్దార్ బి.లోకరాజు తెలిపారు. స్థానిక చాపరాల సత్యనారాయణ కళాశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు పోలింగ్ కేంద్రాలకు నిర్వహణకు పదిమంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో 1481 మంది వాటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ ఆఫీస్ ఏవో ఎండి ఇమ్రాన్, ఎం ఆర్ ఐ శివకుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** పట్టభద్రుల ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక రాజా జూనియర్ కళాశాలలో రెండు పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేయగా ఓటర్ల సౌకర్యార్థం షామియానాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్ల బయట లోపల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. చల్లపల్లి మండలం మొత్తం 2024 మంది ఓటర్లు ఉన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూతులను ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కే నాగమల్లేశ్వరరావు పరిశీలించారు. బుధవారం జూనియర్ కళాశాలకు వెళ్లి పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అక్కడ సదుపాయాల గురించి సంబంధిత పోలింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా ఈ రెండు పోలింగ్ కేంద్రాల్లో 2047 ఓట్లు ఉన్నాయి. ఆయన వెంట ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసరావు డిటి మండలి కేస వి ఆర్ ఐ బాలాజీ పాల్గొన్నారు.



చల్లపల్లి మండలంలో...

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వ రమ్మ ఆధ్వర్యంలో మచిలీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధ వారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడుల్లో భాగంగా మచిలీపట్నం వైఎస్ఆర్ కాలనీలోని ముస్తాఖాన్ పేటలో కాసుల పద్మ వద్ద నుంచి మొత్తం 43 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఆమెపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** ఉయ్యూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నలుగురిని అరెస్టుచేసి వారి వద్ద నుంచి 42 మద్యం సీసాలు స్వాధీన పరుచుకున్నట్టు సీఐ సీహెచ్ శేషగిరిరావు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా డ్రై డే అమలులో ఉన్నందున స్టేషన్ పరిధిలో దాడులు జరిపి మద్యం విక్రయిస్తున్న నలుగురిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు. ఎస్సై కళ్యాణి, ఎన్ఫోర్స్ మెంట్ విజయవాడ ఎస్సై రామశేషయ్య, ఈఎస్టీ మచిలీపట్నం ఎస్సై సంతోశ్, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు. లైసెన్స్ లేకుండా మద్యం విక్రయించడం నేరమని, అటువంటి నేరాలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న మద్యం

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ ప్రేమ జంట పెద్దల నుంచి రక్షణ కల్పించాలంటూ బుధ వారం బందరు తాలూకా పోలీసులను ఆశ్రయించారు. మచిలీపట్నం మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన మర్రి రోహిత్ రెడ్డి, పెడన మండలం కష్ణాపురం గ్రామానికి చెందిన ఉప్పాల బాల మల్లేశ్వరి గత మూడు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమపెళ్లికి పెద్దలు నిరాకరించడంతో మంగళ వారం చర్చిలో వివాహం చేసుకుని పోలీసులను ఆశ్రయించారు.





అవగాహన కల్పిస్తున్న మెప్మా సిఎంఎం బసవేశ్వరరావు

ఆన్‌లైన్ కొనుగోళ్లపై అవగాహన

ప్రజాశక్తి - గుడివాడ : పట్టణ పేదల నిర్మూలన సంస్థ మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో మహిళలు తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేసేందుకు ఆన్‌లైన్ పద్ధతిలో కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సిఎంఎం బసవేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక కైకాల సత్యనారాయణ పురపాలక కళామందిరంలో మెప్మా ఆధ్వర్యంలో ఆన్‌లైన్ కొనుగోలు యాప్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 8న అంతార్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్వయం సహాయక మహిళల ద్వారా తయారు చేయబడిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. గుడివాడ ప్రతి సంఘం సభ్యులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేవిధంగా సిఓలు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఓలు, ఆర్‌పిలు, డ్వాక్రాసంఘులు లీడర్లు పాల్గొన్నారు.

సమతా సైనిక్ దళ్ జాతీయ కార్యదర్శిగా యేసుపోగు నియామకం



ప్రజాశక్తి - వన్‌టౌన్ : సమతా సైనిక్ దళ్ జాతీయ కార్యదర్శిగా యేసుపోగు నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆయన సమతా సైనిక్ దళ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సమతా సైనిక్ దళ్ తరపున నాగేశ్వరరావు చేసిన కృషికి గుర్తింపుగా ఆయనను జాతీయ కార్యదర్శిగా నియమిస్తున్నట్లు సమతా సైనిక్ దళ్ జాతీయ అధ్యక్షులు అశోక్ సాగర్ తెలిపారు. ఈ మేరకు నాగేశ్వరరావుకు బుధవారం నియామక ఉత్తర్వులను అందజేశారు. జాతీయ కార్యదర్శిగా నాగేశ్వరరావు భారతదేశ వ్యాప్తంగా సమతా సైనిక్ దళ్‌ను మరింతగా విస్తరించేందుకు కృషి చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భవిష్యత్తు ఆర్థిక అవసరాలకు జీవిత బీమా తోడ్పాటు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించడానికి జీవిత బీమా ఎంతగానో సహాయపడుతుందని హెచ్‌డిఎఫ్‌సి ప్రొడక్ట్స్ అండ్ సెగ్మెంట్స్ హెడ్ అనీష్ ఖన్నా అన్నారు. ప్రముఖ జీవిత బీమా సంస్థ హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ తన తాజా ఉత్పత్తి, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ క్లిక్ 2 అచీవ్ పార్ అడ్వాంటేజ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రణాళిక స్వల్పకాలిక అవసరాలను తీర్చడంతో పాటు, దీర్ఘకాలిక ఆకాంక్షలకు మద్దతునిస్తుందన్నారు. ఈ ఉత్పత్తి ఒక వ్యక్తి వివిధ జీవిత దశలకు సంబంధించిన మైలురాళ్లను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిందన్నారు. హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ క్లిక్ టూ అచీవ్ పార్ అడ్వాంటేజ్ పొదుపులను పెంచుతూ, ముందస్తు లిక్విడిటీ కోసం ఫ్లెక్సిబిలిటీని అందిస్తూ, భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించడానికి సహాయపడుతుందన్నారు. పాలసీ కంటిన్యూయెన్స్ బెనిఫిట్ (పిసిబి) ఎంపిక ద్వారా, జీవిత బీమా చేసిన వ్యక్తి మరణించిన సందర్భంలో భవిష్యత్ ప్రీమియంలు మాఫీ చేయబడతాయన్నారు. డెత్ బెనిఫిట్ వెంటనే ఒకే మొత్తంగా చెల్లించబడుతుందని, ఈ పథకం కింద భవిష్యత్ ప్రయోజనాలు నామినీ లేదా ప్రాణాలతో బయటపడిన వారికి కొనసాగుతాయన్నారు. . హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ క్లిక్ -2 అచీవ్ పార్ అడ్వాంటేజ్ అదనపు జీవిత కవరేజీ ఒకరు తన జీవిత భాగస్వామిని కవర్ చేయడానికి ఎంచుకోవచ్చని, ఒక వ్యక్తికి వర్తించేలా ప్రస్తుత పన్ను చట్టాల ఆధారంగాఆర్థిక బాధ్యతలను నిర్వర్తించే ప్రతి వ్యక్తికి జీవిత బీమా అత్యవసరం అని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - వత్సవాయి : ఓ కారు అదుపుతప్పి బైకును ఢీకొనటంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు సమా చారం మేరకు బోనకల్లు వైపు నుంచి వస్తున్న కారు అదుపుతప్పి మోటార్ సైకిల్ నడుపుతున్న వ్యక్తి ఎస్‌కె బాజీని ఢీకొన టంతో అతనికి తీవ్ర గాయాల య్యాయి. క్షతగాత్రుడిని వైద్య నిమిత్తం ఖమ్మం తరలిం చారు. ప్రమాదానికి గురైన కారును పోలీసులు స్వాధీన పరుచు కున్నారు. మరో సంఘ టనలో జానకిరామయ్యకు కూడా ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన కారు, బైకు

ఎంఎల్‌సి ఎన్నికలకు సర్వం సిద్ధం

పట్టభద్రుల ఎన్నికల నిర్వహణకు సౌకర్యాలు సిద్ధం అయ్యాయి. పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామాగ్రితో సహా సిబ్బంది ఇప్పటికే చేరుకున్నారు. అధికారులు తగిన ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ ఎన్నికలకు పనిలో నిమగ్నమయ్యారు.

ప్రజాశక్తి - గంపలగూడెం : స్థానిక హైస్కూల్‌లో 59,60 బూత్ నెంబర్లు ఏర్పాటయ్యాయి. ఇందులో 59 బూత్ నెంబర్‌కు గానూ 969 ఓట్లు ఉండగా, అందులో మహిళలు 271, పురుషులు 698 గా ప్రిసైడింగ్ ఆఫీసర్ మేరుగు క్రిస్టఫర్ తెలిపారు. 60 బూత్ నెంబర్లో మొత్తం ఓట్లు 893 కాగా, మహిళలు 250, పురుషులు 643గా ప్రిసైడింగ్ అధికారి ఎమ్మార్ శేషం రాజు వివరించారు. ఏపీవోలు కొంగల అశోక్ కుమార్, తేళ్లూరి మురళి, ఓపివోలు సాయికిరణ్, జి ప్రతాప్, ఏ వెంకటరావు, లక్ష్మయ్యలు ఉన్నారు.

ఎన్నికల కేంద్రానికి చేరుకున్న బ్యాలెట్ బాక్సులు

మైలవరం : నేడు జరగనున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సిబ్బంది బుధవారం స్థానిక వివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకున్నారు. మండలంలో 2,605 మంది ఓటర్లు ఉన్నారని, వీరికోసం, 4 పోలింగ్ బూత్‌లు, 16 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించామని తహశీల్దార్ అబ్దుల్ దరియా తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అన్నారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.


ఇబ్రహీంపట్నం ఎంఆర్‌ఓ వెంకటేశ్వర్లు

తిరువూరు : తిరువూరు డివిజన్‌లో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్‌డిఓ మాధురి తెలిపారు. బుధవారం ఆమె పోలింగ్ విధులకు సిద్ధమవుతున్న సిబ్బందికి కావాల్సిన మెటీరియల్‌ను పరిశీలించారు. మొత్తం డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 9337 ఓట్లు ఉన్నట్లు చెప్పారు. తిరువూరు పట్టణం, రూరల్ లో 2701 మంది పట్టభద్రుల ఓటర్లకు గాను తిరు వూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మూడు పోలింగ్ స్టేషన ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కంచికచర్ల : కృష్ణా -గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్ విషయం తెలిసిందే. కంచికచర్ల మండలంలో 1799 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు 3 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు ఇన్చార్జి తహశీల్దార్ మానస బుధవారం తెలిపారు. పోలింగ్ బూత్ నెంబర్ 8లో 644మంది, 39 లో 585, 40లో 570 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బంది, ఎన్నికల సామాగ్రితో బుధవారం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నందిగామ రూరల్ సిఐ చవాన్, ఎససై రాజుతో కలిసి పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సందర్భంగా ఎన్నికల నియమావలి ప్రకారం శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

మద్యం షాపుల బంద్ : శాసనమండలి ఎన్నికలు పులస్కరించుకొని కంచికచర్ల మండలంలో మంగళవారం నుండే మద్యం షాపులు మూసివేసినట్లు ఎక్సైజ్ సిఐ అఫ్రవునూనీసా బేగం తెలిపారు. బుధవారం సాయంత్రం వరకు మద్యం అమ్మకాలకు అనుమతి లేదన్నారు. మండలంలో బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు మంగళవారం సాయంత్రం నుంచే యథేచ్ఛగా సాగాయి.

ఇబ్రహీంపట్నం : గ్రాడ్యుయేట్ ఎన్నికల సందర్భంగా ఓటర్ స్లిప్పులు అందని వారు కంగారు పడాల్సిన అవసరం లేదని, ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద సమాచారం నిమిత్తం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఉప అధికారి ఇబ్రహీంపట్నం ఎమ్మార్వో వెంకటేశ్వర్లు తెలిపారు. అక్కడ తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని వారి ద్వారా సమాచారం తెలుసుకొని, క్రమ సంఖ్య ద్వారా ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలింగ్ సంబంధించి అన్ని ఏర్పాటు చేశామని, పోలీస్ వారి ఆధ్వర్యంలో ప్రతిష్ట భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు.

నందిగామ : నందిగామ, చందర్లపాడు, వీరులపాడు, ఆయన మండల కేంద్రాల్లో పోలింగ్ స్టేషన్లో ఏర్పాటు చేశారు. నందిగామ నియోజకవర్గంలో దాదాపు 8,958 పట్టభద్రుల ఓటర్లు తమ ఓటును ఈ నెల 27న తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని అధికారులు తెలిపారు. నందిగామ నియోజకవర్గంలో పది పోలింగ్ బూత్‌లు, జగ్గయ్యపేట నియోజకవర్గంలో 12 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. నందిగామ ఆర్డిఓ కార్యాలయ వద్ద నుండి పోలింగ్ కేంద్రాలకు బస్సుల ద్వారా తరలింపు పోలీసుల కట్టుదిట్టమైన భద్రతతో బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి తరలించారు. ఆర్‌డిఓ బాలకృష్ణ దగ్గర ఉండి పర్యవేక్షించారు. నందిగామ ఆర్‌డిఓ కె.బాలకృష్ణ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో మొత్తం 22 పోలింగ్ కేంద్రాలున్నాయని కేంద్రానికి ఐదుగురు అధికారులు ఉంటారని అన్నారు.


తిరువూరు పోలింగ్ బూత్ వద్ద పరిశీలిస్తున్న ఆర్‌డిఓ


సామాగ్రితో ఎన్నికల కేంద్రానికి చేరుకున్న సిబ్బంది (గంపలగూడెం)


కంచికచర్ల పోలింగ్ బూత్ వద్ద సిబ్బంది...





పోలింగ్ బూత్‌కు ప్రయాణమైన ఎన్నికల సిబ్బంది (నందిగామ)

ఒక్క హామీ అమలు చేయలేదు : ఎంసిపిఐ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఎంసిపిఐ) విజయవాడ నగర 2వ మహాసభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విజయవాడ వన్ టౌన్ కామ్రేడ్ మర్రెడ్డి రామకోటయ్య వేదిక (వించి పేట కమ్యూనిటీ హాల్)లో వి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన సభ జరిగింది. పార్టీ జెండాను రాష్ట్ర కార్యదర్శి మర్రెడ్డి వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అనేక పరిశ్రమలు మూతపడుతున్నాయని, నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాల్చిందన్నారు. రైతుల పంటలు ముఖ్యంగా పత్తి, మిర్చి ధరలు ఘననంగా తగ్గిపోయాయన్నారు. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి ఏరులై పారిస్తుంటే కనీసం దానిమీద అజమాయిషీ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే నిరసన కార్యక్రమాలు చేస్తూనే ఉంటామని ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్ డిమాండ్ చేశారు. విజయవాడ నగర 2వ మహాసభ నూతన కమిటీగా కాసాని గణేష్ బాబు, వల్లెపు లక్ష్మీ నారాయణ, కంకిపాటి అనిల్ కుమార్, కాసాని సుజాత, అనకాపల్లి కనకరాజు, మంగళగిరి శేషు, సోమి ఎల్లమ్మను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న వెంకట రెడ్డి


మద్యం దుకాణానికి తాళం వేసిన ఎక్సైజ్ సిబ్బంది

ఎక్సైజ్ సిబ్బంది దాడి : అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - విస్సన్నపేట : రెడ్డిగూడెం రోడ్‌లో గల కనక దుర్గా వైన్స్ షాప్ వద్ద అనుమతి లేని చోట పెట్టిన 4,300 మద్యం సీసాలు గల 123 బాక్సులను ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. విస్సన్నపేటలోని అంబెద్కర్ సెంటర్‌లో అనుమోలు పాండు రంగారావు అనే వ్యక్తి అనధికారికంగా మద్యం అమ్ము తుండగా 22 మద్యం సీసాలు 10 బీర్ సీసాలు స్వాధీనం చేసుకు న్నారు. కొండపర్వలో సాంబశివరావు అనే వ్యక్తి అనధికారికంగా మద్యం అమ్ముతుండగా 23 మద్యం సీసాలు 10 బీర్ సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తిరువూరు ఎక్సైజ్ సిబ్బంది తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని బుధవారం ఉదయం కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉయ్యూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 21,119 మంది ఓటర్లు నమోదై ఉన్నారన్నారు. పోలింగ్ నిర్వహణకు 25 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ ఉదయం ఎనిమిది గంటల నుండి నాలుగు గంటల వరకు నిర్వహిస్తామన్నారు. డివిజన్ పరిధిలోని మండలాలను 3 సెక్టార్లుగా విభజించి 25 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో 8 పోలింగ్ స్టేషన్లు, పెనమలూరు, కంకిపాడు ఉయ్యూరు మండలాల్లో మూడేసి పోలింగ్ స్టేషన్లు, తోట్లవల్లూరు, పామర్రు, మొవ్వ, పమిడిముక్కల మండలాల్లో రెండేసి పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. కలెక్టర్ వెంట ఉయ్యూరు ఆర్డిఓ బిఎస్. హెలా షారోన్ , తహసిల్దార్ సురేష్ కుమార్ ఉన్నారు.



ఉయ్యూరులో పోలింగ్‌పై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక గుడివాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో బుధవారం శాసనమండలి ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని, ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది ఎన్నికలకు కావలసిన సామాగ్రిని పరిశీలించి తీసుకువెళ్ళాలన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఉంగుటూరు : శివరాత్రి సందర్భంగా తేలప్రోలులోని శివాలయం వద్ద శివాలయానికి వచ్చి వెళ్ళే భక్తుల కోసం ఆయుర్వేద వైద్యులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి 50 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేద డాక్టర్ టి లక్ష్మి సౌజన్య మాట్లాడుతూ అన్ని రకాల రోగులకు ఆయుర్వేదంలో వైద్యం అందిస్తున్నామని తద్వారా మంచి ఫలితం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ పుష్పజా తదితరులు పాల్గొన్నారు.

శివాలయాలు కిటకిట



మోపిదేవి మండలం పెదకళ్లేపల్లిలో...



అవనిగడ్డ మండలంలో పులిహోర పంపిణీ చేస్తున్న గోవర్ధన్



ఉయ్యూరు మండలంలో బారుతీరిన భక్తులు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలంలోని పెదకళ్లేపల్లికి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేలాదిగా భక్తులు పోటెత్తారు. అటు కోడూరు మండలం నుంచి పిట్టలలంక రేవు ద్వారా పెద్ద సంఖ్యలో భక్తులు పడవలు దాటి కల్లేపల్లి చేరుకున్నారు కష్ణానది ఉత్తర వాహినిగా ప్రవహిస్తుండడం ఈ పుణ్యక్షేత్రం ప్రత్యేకత ఎంతో విశిష్టమైన పుష్కర ఘాట్ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. దక్షిణ కాశీగా భాసిల్లుతున్న పెదకళ్లేపల్లి పుణ్యక్షేత్రంలో స్వయంభువుగా వెలసిన శ్రీ దుర్గా నాగేశ్వర స్వామిని క్యూలైన్ల ద్వారా భక్తులు దర్శించుకుని విశేష పూజలు చేశారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో భక్తులకు విస్తత ఏర్పాట్లు చేశారు. రెవెన్యూ, పోలీస్, గ్రామ పంచాయతీ, ఆర్.డబ్ల్యూ.ఎస్, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు తమ సిబ్బందితో భక్తులకు సేవలు అందించారు. అవనిగడ్డ డిఎస్పి తాళ్లూరి విద్యశ్రీ ఆధ్వర్యంలో చల్లపల్లి సీఐ కే.ఈశ్వరరావు పర్యవేక్షణలో ఎస్ఐ సత్యనారాయణ తమ సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, ఘాట్ వద్ద గస్తీ, క్యూ లైన్ల పర్యవేక్షణ నిర్వహించారు. తొలుత ఆర్డీవో స్వాతి శ్రీ దుర్గా నాగేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. దేవదాయ శాఖ అధికారులు అనువంశిక ధర్మకర్తలు ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టి, ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ షర్మిష్ట, కూటమి నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దర్శించుకున్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ప్రముఖ పారిశ్రామికవేత్త వీరరాఘవయ్య ఫౌండేషన్ చైర్మన్ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సుదూర ప్రాంతాల నుండి తరలివస్తున్న భక్తజన సందోహానికి దాహార్తిని తీర్చడం కోసం పదిహేను వేలు మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విక్కుర్తి రాంబాబు, బర్మా శ్రీనివాస రావు,భూపతి రేణుకయ్య పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : మహాశివరాత్రిని మండలంలో పలు శివాలయాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ సిద్దేశ్వర స్వామి దేవస్థానం నందు గోపూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, విశేష పూజలు, రుద్ర హెూమములు, శాంతి కళ్యాణము ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కవుతరం శివాలయం వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఎంఎల్ఎ వెనిగండ్ల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - గుడివాడ : మహా శివరాత్రి సందర్భంగా గుడివాడ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని భీమేశ్వరస్వామి వారి దేవస్థానం, తదితర శివాలయాలలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రత్యేక పూజలు నిర్వహించారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : చల్లపల్లి మండల పరిధిలోని యార్లగడ్డలో పుట్ట తీర్థానికి భక్తులు పోటెత్తారు. తీర్థము క్షేత్రంగా యార్లగడ్డ ప్రసిద్ధి చెందింది. గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల్లోని భక్తులు తరలివచ్చి పుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్ట్ గ్రామ సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

అలాగే చల్లపల్లి మండలం నడకుదురులోని ప్రాచీన శైవక్షేత్రం శ్రీ పథ్వీశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు, కుమార్తె - అల్లుడు శీలం కష్ణప్రభ - అశ్విన్ కుమార్ దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు .**ప్రజాశక్తి-ఉయ్యూరు** : శివరాత్రి పురస్కరించుకుని బుధవారం ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో శివాలయాలకు భక్తులు తరలివచ్చారు. శ్రీజగదంబా సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తుల తాకిడి కన్పించింది. క్యూలైన్లలో నిలుచుని స్వామివారిని దర్శించి పూజలు చేసారు. పెద్దయెత్తున తరలివచ్చిన భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారి అన్నిఏర్పాట్లు చేశారు. చినఓగిరాల, పెదఓగిరాల, కలవపాముల, బోళ్లపాడు, సాయిపురం, ముదునూరు శివాలయాల్లో భక్తులు సందడి కన్పించింది. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డ మండల పరిధిలోని పాత ఎడ్ల లంక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. దివిసీమ ప్రాంతానికి చెందిన వారే కాకుండా గుంటూరు జిల్లా ప్రాంతాలకు చెందిన వారు కూడా పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజాము 5 గంటల నుండి భక్తులు కృష్ణా నదికి వచ్చి స్నానమాచరించి తమతో పాటు వారి పశువులను కూడా తెచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తులకు పులిహోర మజ్జిగ పంపిణీ

మహాశివరాత్రి సందర్భంగా పాత ఎడ్లంక బాల కోటేశ్వర స్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల కోసం టిడిపి నాయకులు ఎన్ఆర్ బొబ్బా గోవర్ధన్ పులిహోర మజ్జిగ అందజేశారు.

ఐలూరుకు శివరాత్రి తాకిడి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : దక్షిణ కాశీగా వెలుగొం దుతున్న ఐలూరులో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బుధవారం సుమారు లక్ష మంది భక్తులు కష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఐలూరులో వేంచేసి ఉన్న శ్రీ రఘునాయక రామేశ్వర స్వామి వారి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో దైవదర్శనం చేసుకున్నారు. ఎంపీడీవో రవికాంత్,తహసిల్దార్ కుసుమకుమారి, సర్కిల్ ఇన్స్పెక్టర్ వై. చిట్టి బాబు, దేవాలయం గుమస్తా రాజగోపాల్, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను చేశారు. ఉపన్యాసం ఆచరించడానికి అవసరమైన జల్లు స్నానాలు ఏర్పాటు దైవదర్శనానికి బార్గెట్లు, మంచినీటి సౌకర్యం పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలను భక్తులకు సక్రమంగా అందించారు.



రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు మాన్య ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ (అండర్ 14) పోటీలకు గన్నవరంకు చెందిన దాసరి మాన్య ఎంపికైంది. ఈ మేరకు ఫెన్సింగ్ శిక్షకుడు ధనియాల నాగరాజు బుధవారం పత్రికలకు తెలిపారు. కంచికచర్ల వద్ద ఏకత్వ ఇంటర్ నేషనల్ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి ఎంపికలకు హాజరైన మాన్య క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. శాబర్ క్రీడాంశం నుండి పాల్గొన్న మాన్య గతంలో రాజమండ్రి లో జరిగిన జాతీయ స్థాయి అండర్ 14 ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలోపాల్గొని ప్రతిభ కనబరచింది. అలాగే పలు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని రాణిచినది.మార్చి 1,2 తీదీలలో కంచికచర్ల ఏకత్వ ఇంటర్ నేషనల్ స్కూల్ లో జరిగే ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల అండర్ 14 బాలికల ఛాంపియన్ షిప్ పోటీలలో మాన్య కష్ణ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తుందని నాగరాజు తెలిపారు. ఈసందర్భంగా మాన్యను, ఉత్తమ శిక్షణ ఇచ్చి ప్రోత్సాహిస్తున్న ధనియాల నాగరాజును స్రవంతి స్కూల్ ప్రిన్సిపాల్ కే.రామకష్ణ, గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య నాగేశ్వరావు,గన్నవరం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే.వి.ఆర్ కిషోర్, ప్రముఖ న్యాయవాది తిరివీధి వెంకయ్యతదితరులు అభినందించారు. కాగా మాన్య గన్నవరం స్రవంతి స్కూల్ లో 9 వ తరగతి విద్యనభ్యసిస్తుంది.



పోటీలకు ఎంపికైన మాన్య

నేడు స్పెషల్ క్యాజువల్ లీవ్ : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా జిల్లాలో ఓటు హక్కు కలిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను భారత ఎన్నికల సంఘం ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక హక్కు అయిన వారి ఓటు హక్కును వినియోగించు కునేందుకు ప్రైవేటు, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, బ్యాంకులు, విద్యాసంస్థలలో ఓటరుగా నమోదు చేసుకున్న ఉద్యోగులు, కార్మికులు వారు ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అనుమతులు ఇవ్వడం, షిఫ్ట్‌లను సద్దుబాట్లు (అడ్జస్ట్) చేయడం వంటి వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు.

నేత్రపర్వంగా శాంతి కళ్యాణం



ప్రజాశక్తి-గన్నవరం : మహాశివరాత్రి పర్వదిన వేడుకలను గన్నవరం ప్రాంతంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశాలక్షి అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి శాంతి కల్యాణం జరిపారు. తొలుత అఖండ దీపప్రజ్వలన, రుద్రాబి . షేకాలు, పంచామతాలతో అభిషేకాలు, లక్ష పుష్పార్చన నిర్వహించారు. సాయంత్రం వేద పండితుల మంత్రోర్చనలతో ఆదిదంపతులకు శాంతి కల్యాణం జరిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. లింగోద్భవ కాలంలో స్వామివారికి అన్నాభిషేకం జరిపారు. దావాజి గూడెంలోని శ్రీభ్రమారాంబిక సమేత మల్లికార్జునస్వామి, శ్రీవల్లిదేవసేన సుబ్రమణ్యస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి కల్యాణ మహెూత్సవం, లింగోద్భవ కాలంలో ఏకాదశ మహారుద్రాభిషేకం జరిపారు. కేసరపల్లిలో శ్రీసోమలింగేశ్వరస్వామి ఆలయం, గుమ్మ డి క్షేత్రంలోని శివాలయంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు.


అన్నదానం ప్రారంభిస్తున్న వెంకట కృష్ణ ప్రసాద్

అన్నదానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

మండలంలోని కె.అగ్రహారం స్టీల్‌ప్లాంట్ గేట్ ఎదురుగా ఉన్న బాలసైదా బాబా దర్గా వద్ద బాలసైదా సేవ సమితి అధ్యక్షుడు షేక్ ఖాజా ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ఆన్నదాన కార్యక్రమాన్ని జనసేన యువనాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు ఖాజాని సన్మానించారు. శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో దాతలు ఏర్పాటు చేసిన అల్పాహారం వితరణను ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఎఇసి మెంబర్ చక్కా సూర్య ప్రకాష్ గుప్తా (నాని), శ్రీ వాసవి సేవా సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకరపర్తి సోమేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు పేరూరి నరసింహారావు, వార్డు కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

2న విజయనగరంలో ఐఎస్ఎ జాతీయ సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :

ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తేసియా (ఐఎస్ఎ) లోజిస్ట్స్ నేషనల్ స్పాన్సర్ (సిఎంఇ) సదస్సును మార్చి 2వ తేదీన విజయనగరంలో నిర్వహించనున్నట్లు ఐఎస్ఎ రాష్ట్ర అకడమిక్ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్రం నుండి 300 మంది ఎనస్తేసియా వైద్యులు, పీజీలు హాజరుకానున్నట్లు తెలిపారు. విజయనగరం ఐఎస్ఎ సిటీ బ్రాంచ్ ఆధ్వర్యంలో మిమ్స్ మెడికల్ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు ఈ సదస్సును నిర్వహించనున్నట్లు డాక్టర్ పి.ఎస్.వి.రామారావు తెలిపారు. సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ మాదన్‌మోహనరెడ్డి, ఐఎస్ఎ జాతీయ పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎస్‌సి చక్రరావు, ఐఆర్‌సిఎఫ్ చైర్మన్ డాక్టర్ కుచేలాబాబు, డాక్టర్ కామేశ్వరరావు, డాక్టర్ భీమేశ్వర్, డాక్టర్ రాగూర్, డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ కిరణ్, డాక్టర్ ఆళ్ల ప్రశాంతితోపాటు ఇసి సభ్యులంతా పాల్గొంటారని తారక ప్రసాద్, రామారావు తెలిపారు.

పోలింగ్ స్టేషన్ల నెంబర్లు మార్పు

విజయవాడ :

విజయవాడ, సత్యనారాయణపురంలోని ఏకేటీపీయ మున్సిపల్ హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎలక్షన్ జరిగే పోలింగ్ బూత్ నెంబర్లలో మార్పులు జరిగాయి. మొదటగా 94, 95, 96, 97, 98 నెంబర్లతో పోలింగ్ బూత్‌లు నిర్ణయించారు. ఇప్పుడు 94 A, 95A, 96A, ఈ మూడు బూత్‌లు కొత్తగా పెట్టారు. అయితే ఈ మూడు బూత్‌లు పక్కపక్కన ఉంటే బాగుండేది 94 తర్వాత 94A ఉండి ఉంటే బాగుండేది. ఒక్కొక్కదానికి మధ్య దూరం ఉండటంతో ఓటర్లు చాలా ఇబ్బంది పడాల్సి ఉంటుంది. సిఇఒ ఆంధ్రా అఫీషియల్ వెబ్‌సైట్లో మాత్రం 94a,95a,96a పోలింగ్ బూత్‌లు లేవు. సచివాలయ సిబ్బంది ద్వారా పంచిన స్లిప్పుల్లో కూడా ఏ అనే పేరుతో బూత్‌లు లేవు. ఓటర్లు గమనించుకుని ఓటేయాల్సి ఉంటుంది.

కృష్ణానదిలో లక్షలాది మంది స్నానాలు

ప్రజాశక్తి - విజయవాడ : మహాశివరాత్రి సందర్భంగా కృష్ణానదిలో లక్షలాది మంది బుధవారం తెల్లవారుజాము నుండే స్నానాలు ఆచరించారు. విజయవాడతోపాటు నదీతీరంలో అనేక చోట్ల స్నానాలు చేశారు. సమీపంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రద్దీ దృష్ట్యా పోలీసు యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ, రెవెన్యూశాఖ తదితర శాఖల అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. యాత్రికుల రాకతో స్థానిక పిఎన్ బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలు, పద్మావతి ఘాట్, కృష్ణవేణిఘాట్, దుర్గాఘాట్, రాజీవ్‌గాంధీపార్కు ఏరియాల, వినాయకుని గుడి, ఫ్లైఓవర్ దిగువన, కుమ్మరపాలెం సెంటర్ తదితర ప్రాంతాలు కిటకిటలాడాయి. అయితే కొందరు బైక్‌లపై, ఇతర వాహనాలపై వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ మళ్లింపు విషయం తెలియకపోవడం, వాహన దారులు పిఎన్ బస్‌స్టేషన్ ఏరియా నుంచి కృష్ణవేణిఘాట్, శనీశ్వరాలయం, ప్రకాశం బ్యారేజి ఏరియా, గద్దబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాలకు విచ్చేసిన వాహనదారులను వెనుక్కి పంపిచడంతో ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఉత్తరాది జిల్లాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు దుర్గగుడికి రావడంతో ఆ ప్రాంతం పూర్తిగా రద్దీ ఏర్పడింది. యాత్రికులను రాకపోకలను నియంత్రణ చేయడం పోలీసులకు, ఇతర అధికారులకు కష్టమైంది.

కిటకిటలాడిన ఘాట్లు

యాత్రికులు నిర్వహించిన క్రతువులకు వినియోగించే సామానులు (పండ్లు, పూలు, చాట, బుట్ట, ఇతర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయి. క్రతువులు నిర్వహించడానికి కూడా విపరీతంగా డబ్బులు డిమాండ్ చేశారు. ఇదే అదనుగా ప్రజల నమ్మకాలను కొందరు దళారులు సులువుగా సొమ్ము చేసుకున్నారు.

ఎంఎల్‌సి ఓటు వేసేందుకు ఇవి కావాలి

విజయవాడ : ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓటర్లు పోలింగ్ స్టేషన్లలో గుర్తింపు కోసం ఎన్నికల సంఘం నిర్దేశించిన పత్రాలతో హాజరు కావాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా ఒక పత్రం చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని ఆమె తెలిపారు. ఆధార్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, భారతీయ పాస్ పోర్టు, రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు లేదా ఇతర ప్రైవేట్ పారిశ్రామిక గృహాల ద్వారా దాని ఉద్యోగులకు జారీ చేయబడిన సేవా గుర్తింపు కార్డుల్లో ఏదైనా గుర్తింపు కార్డు చూపించి ఓటు వేయొచ్చని వివరించారు. ఎంపిలు/ఎంఎల్ఎలు/ ఎమ్మెల్సీలకు జారీ అయిన అధికారిక గుర్తింపు కార్డులు, విద్యాసంస్థలు సంబంధిత ఉపాధ్యాయులు/ గ్రాడ్యుయేట్ల నియోజకవర్గ ఓటర్లు ఉద్యోగంలో ఉన్న జారీ చేసిన సేవా గుర్తింపు కార్డు, యూనివర్సిటీ జారీ చేసిన డిగ్రీ/డిప్లొమా ఒరిజినల్ సర్టిఫికెట్, కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన ఫిజికల్ హ్యాండిక్యాప్ ఒరిజినల్ సర్టిఫికేట్, ప్రత్యేక వైకల్యం ఐడి కార్డు, సామాజిక న్యాయం, సాధికారత, భారత ప్రభుత్వం ద్వారా అందిన గుర్తింపు కార్డు చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.

అవనిగడ్డ నియోజకవర్గంలో 9014 మంది ఓటర్లు

ప్రజాశక్తి-అవనిగడ్డ :

కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాలకు గురువారం జరగనున్న పట్టభద్రుల ఎన్నికలలో అవనిగడ్డ నియోజకవర్గంలో 9014 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 5449 కాగా, మహిళలు 35 65 మంది పది పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లతో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించారు.

బస్సుల రద్దీ

ప్రజాశక్తి-చల్లపల్లి (మొవ్వ) :

పమిడిముక్కల మండలం ఐలూరులో బుధవారం జరిగే మహాశివరాత్రికి వెళ్లే భక్తులకు బస్సు సౌకర్యం లేక కూచిపూడి సెంటర్లో నానా ఇబ్బందులు పడుతున్నారు. పామర్రు నుండి వస్తున్న బస్సులు గంటకు ఒకటి వస్తున్నాయి. అవి కూడా ఖాళీ లేకుండా రావటం వల్ల కూచపూడి సెంటర్లో ఆగకుండానే వెళ్ళిపో తున్నాయి . కూచిపూడి సెంటర్లో పిల్లలు, వద్దులు, ప్రయాణికులు నిలబడి బస్సు కోసం ఎదురుచూస్తున్నారు.

యనమలకుదురులో శివరాత్రి ఉత్సవాల దృశ్యాలు


ప్రబల ఊరేగింపు

















కేన్సర్ ఆసుపత్రికి అడుగులు

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని అమరావతిలో బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ సెంటర్ నిర్మాణానికి త్వరలో అడుగులు పడనున్నాయి. ఆసుపత్రి నిర్మాణానికి అడ్డుగా ఉన్న హెచ్‌టి విద్యుత్ టవర్లు, లైన్ల తొలగింపు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముమ్మరమ య్యాయి. ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించిన స్థలానికి వెలుపల ఉండేలా హెచ్‌టీ విద్యుత్ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరుకు సమీపంలో ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం 15 ఎకరాలు కేటాయించింది. ఫేజ్-1లో 300 పడకలతో ఆసుపత్రి నిర్మించాలని ప్రణాళికలు రూపొందించారు. ఆసుపత్రి నిర్మాణానికి 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు భూమిపూజ చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆసుపత్రి నిర్మాణం ఊసే లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, అమరావతి నిర్మాణానికి ప్రాధాన్యత నివ్వడంతో మళ్లీ ఈ అంశం ముందుకొచ్చింది. ఎమ్మెల్యే, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ ఇటీవల ఆసుపత్రికి కేటాయించిన స్థలాన్ని సిఆర్‌డిఎ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ ప్రాంతంలో హెచ్‌టి విద్యుత్ లైన్లు అడ్డుగా ఉండటంతో వాటిని తొలగించాలని సిఆర్‌డిఎ అధికారులను కోరారు. హెచ్‌టి లైన్లు తొలగిస్తే ఆసుపత్రి నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు అవకాశం ఉంటుందని బాలకృష్ణ చెప్పడంతో సిఆర్‌డిఎ అధికారులు ట్రాన్స్‌కోకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రికి కేటాయించిన స్థలంలో హెచ్‌టీ లైన్ల తొలగింపు పనులు రెండు నెలల క్రితం మొదలయ్యాయి. ఆసుపత్రి నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ టవర్లు, హెచ్‌టీ లైన్లను తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. పశ్చిమ బంగ్లాకు చెందిన కొంతమంది కార్మికులు పనిలో నిమగ్న మయ్యారు.

కౌలు రైతులకూ భూ ఆధార్ కార్డులివ్వాలి



ప్రజాశక్తి-నందివాడ : వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు భూ ఆధార్‌పై అవగాహన కల్పిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకునేలా చూస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. విశిష్ట సంఖ్య సాయంతో అర్హులైన రైతుల గుర్తింపు, వారికి వర్తించనున్న సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తోందని చెప్తున్నారు. పిఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంట రుణాలు, పంటల బీమా, రాయితీపై సూక్ష్మ పథకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ వంటి పథకాలను నేరుగా పొందే అవకాశం ఉందని నందివాడ మండల వ్యవసాయ శాఖ అధికారి ఎన్.భానుప్రకాష్ వివరిస్తున్నారు.

భూ ఆధార్ కార్డు ఇవ్వాలి

దేగల సత్యనారాయణ, కౌలురైతు, జనార్ధనపురం



కేంద్ర ప్రభుత్వం భూ యజమానులకు మాత్రమే కాకుండా కౌలు రైతులు కూడా భూ ఆధార్ గుర్తింపు కార్డు ఇవ్వాలి. నందివాడ మండలంలో గుర్తింపు నమోదు 80 శాతం అయింది. ప్రభుత్వం గడువు పొడగించి కౌలు రైతులకు కూడా గుర్తింపు కార్డు అవకాశం కల్పించాలి.

గడువు పొడిగించాలి

గూడపాటి సంతోష్ కౌలు రైతు, జనార్ధనపురం



వేసవిలో సాయిల్ హెల్త్ మట్టి నమూనా సేకరణ నిర్వహించాలి. కార్డు ద్వారా రాయితీ పథకాలు పొందడానికి వచ్చే సీజన్ నుంచి మొదలుపెడితే బాగుంటుంది. ఒక రైతుకు రెండు లేదా మూడు చోట్ల పొలం ఉంటే ఎడిట్ ఆప్షన్ ద్వారా భూ ఆధార్ సమగ్ర సమాచారం పొందుపరచాలి.



యాత్రికులకు ప్రసాదాలు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి : మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక భగీరథ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి యాత్రికులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ.. ట్రస్ట్ తరపున 30 సంవత్సరాల నుంచి నిరంతరాయంగా ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామన్నారు. దాతలు ✓హకారం లేకుండా తమ ట్రస్టులోని 15 మంది సభ్యుల సొంత నగదుతో ప్రసాదాల పంపిణీ బాధ్యత తీసుకున్నట్లు చెప్పారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో జిడుగు వెంకట నారాయణ, మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బోగి కోటేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల కోటేశ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివ సత్యనారాయణ, కగ్గా శ్రీనివాసరావు, జూట్రు ఏడుకొండలు, కటారి విష్ణుమూర్తి, పంచల శివ, మారం మల్లికార్జునరావు, పెరుమాళ్ల శివ, నంద్యాల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పఠాన్ జైనబ్ ఖాన్‌కు మంత్రి అభినందనలు

ప్రజాశక్తి-మంగళగిరి : పెయింటింగ్ లో భిన్నమైన శైలితో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించిన మంగళగిరికి చెందిన పఠాన్ జైనబ్ ఖాన్ బుధవారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను ఉండవల్లి లోని నివాసంలో కలిశారు. ఆమె 7 గంటలపాటు శ్రమించి, 318 విస్తరాకులను ఒకటిగా చేసి సర్దార్ భగత్ సింగ్ చిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గానికి చెందిన జైనబ్ ఖాన్ ఈ రికార్డు సాధించడం గర్వంగా ఉందని అన్నారు. ఈ మేరకు ఆమెను అభినందించారు.




సెయింట్ జోన్స్‌లో ఫేర్‌వెల్ డే వేడుకలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లిలోని స్థానిక సెయింట్ జాన్స్ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు ఫేర్వెల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైట్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, మచిలీపట్నం సెయింట్ జాన్స్ ప్రిన్సిపాల్ జాన్, పెడన విశ్వభారతి స్కూల్ ప్రిన్సిపాల్ గౌరీప్రసాద్, మచిలీపట్నం చైతన్య కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతితులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సాబుజాన్, హెచ్‌ఎం ఝాన్సీ సాబ్, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి.

మొన్న పేరు ఉంది.. నేడు లేదు!

- ఓటరు జాబితాలో సిత్రాలు



S-Shifting #-Modified as per Supplement Page 14 Of 372 Electoral Registration Officer Part No: 281

Name of Father/ Mother/ Husband	Address (Place of Ordinary Residence)	Qualification	Business	DOB/Age as on qualifying Date	Male/ Female /Third gender	EPIC Number of AC (if any)	Photo of The Elector
NAGA SAI KUMAR BOMMIDI	1-102/B, BOSU BOMMA CENTER, TADEPALLI	DIPLOMA	pharmacy	06/12/1996	F	[illegible]	
ANJIREDDY GUNDUBOYINA	1-107, BOSUBOMMA CENTER, TADEPALLI	MSC		06/10/1978	F	NYT1142660	
UBBAREDDY UNDUBOYINA	1-107, BOSUBOMMA CENTER, TADEPALLI	MSC	Deleted	28/05/1978	M	MTQ1604412	DELETED
DUL RAHIM SYED	1-107/1, BOSE BOMMA CENTER, TADEPALLI	BSC COMPUTERS	Brand Promoter	09/11/1996	M	NYT1546977	

hifting #-Modified as per Supplement Page 15 Of 372 Electoral Registration Officer Part No: 281

ప్రజాశక్తి- తాడేపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు జాబితాలో అధికారులు చిత్ర విచిత్రాలకు తెరతీశారు. నెల రోజుల క్రితం జిల్లా ప్రిసైడింగ్ అధికారి తాడేపల్లి పట్టణంలో ఓటరు జాబితాలో అందరికీ అందుబాటులో ఉంచారు. బూత్ నంబరు 281, వరుస నంబరు 51లో గుండుబోయిన అంజిరెడ్డి తండ్రి సుబ్బారెడ్డి, తాడేపల్లి, బోసు బొమ్మ సెంటర్, డోర్ నెంబర్ 1-107లో ఓటరుగా నమోదయి ఉంది. రెండు రోజుల క్రితం ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి తుది జాబితా పేరుతో మరలా జాబితా అందజేశారు. అందులో పైన పేర్కొన్న గుండుబోయిన అంజిరెడ్డి పేరు దగ్గర, ఫొటో మీద డిలీట్ అని ముద్ర వేసి ఉంది. ఇది చూసి ఆశ్చర్యపోవడం ఓటరు వంతైంది. ఓటమి భయం పట్టుకున్న అధికార పార్టీ అభ్యర్థి ఇటువంటి జిమ్మిక్కులకు పాల్పడుతున్నారని పట్టభద్రులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరి ఐడెంటిటీ కార్డు తీసుకొచ్చి.. దొంగ ఓట్లు వేయడానికి కూడా అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తున్నట్లు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు హాశీష్



ప్రజాశక్తి- తాడేపల్లి : తైవాన్‌లో చైనీస్ తైపీ రోలర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి 24 నుంచి 30 వరకు జరిగే అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఇండియా నుంచి తాడేపల్లి డోలాస్ నగర్‌కు చెందిన మెరుగుపాల హాశీష్ ఎంపికయ్యాడు. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్షులు లీయు పు- త్సాయ్ నుంచి ఆహ్వానం అందింది. హాశిష్ ఆర్టిస్ట్ స్కేటింగ్ విభాగంలో ఫ్రీ స్టైల్, ఇన్ లైన్, సోలో డాన్స్ పోటీలలో తలపడతాడు. హాశిష్ గత ఏడాది డిసెంబర్లో తమిళనాడు పొలాచిలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో బంగారు పతకం సాధించారు. ఆ అర్హతతోనే తైవాన్ లో జరగనున్న అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడు హాశిష్ ఎంపికపై కోచ్ సత్యనారాయణ, చిట్టిబాబు ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి థామస్, గుంటూరు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నీలిమ, పి.శ్రీకాంత్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

'పది'లో ఉత్తీర్ణతకు వంద రోజుల కార్యాచరణ



నందివాడ - ప్రజాశక్తి : పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది.. పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్ష లంటే సహజంగా విద్యార్థుల్లో భయం ఉంటుంది. ఆ భయం లేకుండా ఉండేందుకు విద్యార్థులకు ఉపాధ్యాయులు ఇచ్చే మార్గదర్శకాలు ఉన్నాయి. మర్చి నెల 17 నుంచి 31వ తేదీవరకు టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. నందివాడ మండలంలో 253 మంది టెన్త్ విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారు. ఉన్నత పాఠశాలల్లో టెన్త్ పిల్ల లకు డీ-గ్రేడ్ వచ్చిందంటే చాలు తామున్నామంటూ వారిలో ఉత్తీర్ణత పెంచేందుకు ఉపాధ్యాయులు ముందంజలో ఉంటున్నారు. కంటికి రెప్పలా కాపాడుకుంటూ పరీక్షల్లో పాసయ్యేంతవరకూ వదిలిపెట్టకుండా పాఠాలను సులభంగా అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారు.

పబ్లిక్ ఎగ్జామ్స్ కోసం పక్కాగా స్టడీ అవర్స్

జి.డేవిడ్ రత్నరాజు, నందివాడ ఎంఈఓ



నందివాడ మండలంలో వంద శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులంతా సమష్టిగా కషి చేస్తున్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.45 నుంచి 5.45గంటల వరకు పక్కాగా స్టడీ అవర్స్ జరుపుతున్నాం. పబ్లిక్ ఎగ్జామ్స్ కోసం ముందు నుంచే క్వార్టర్లీ, ఆరు నెలల పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలు, జవాబులపై ముఖ్యమైన వాటిని విద్యార్థులకు తెలియజేశాం. ముందు నుంచే మా టెన్త్ పిల్లలు ఏ రోజూ పాఠశాలకు గైర్హాజరు కాకుండా చూసుకుంటున్నాం.

ఉత్తీర్ణత సాధించాలంటే పట్టుదలతో చదవాలి

ఎంఎల్ కె వి వి ప్రసాదరావు, తమిరిశ ప్రధానోపాధ్యాయులు



సినిమా, కేబుల్ టీవీ, క్రికెట్, సెల్ఫోన్, చార్జింగ్కు దూరంగా ఉంటే పిల్లలకు 70 శాతం సమయం కలిసొస్తుందని శిక్షణ ఇస్తున్నాం. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి 9లోపు గణితం, సైన్సు, సోషల్ ఇంగ్లిష్ సబ్జెక్టులు చదువుకోవాలి. తేలికగా జీర్ణమయ్యే విధంగా భోజనంలోకి పప్పు, ఆకు కూరలు, మజ్జిగను వాడాలి. నిద్ర, నిత్యకత్యాలకు మినహాయించి ఉన్న తక్కువ సమయంలో క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలి. ప్రశాంతమైన స్థలాన్ని చదువుకునేందుకు ఇంటి వద్ద ఎన్నుకోవాలి. పరీక్షలకు అవసరమైన పుస్తకాలను చేతికి అందుబాటులో ఉంచుకోవటం ముఖ్యం.

విద్యార్థులు పాజిటివ్ గా ఆలోచించాలి.

వి.మణి, పోలుకొండ ప్రధానోపాధ్యాయులు



పరీక్షల సమయంలో పాజిటివ్ ఆలోచనలు ఉండాలి. పరీక్ష పేపర్ ఇచ్చిన వెంటనే జవాబులు రాయటం ప్రారంభించకూడదు. తొలిగా పేప రను క్షుణ్ణంగా చదవాలి. బాగా వచ్చిన ప్రశ్నలకే జవాబులు రాయాలి. అప్పుడు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. దాంతో మిగిలిన ప్రశ్నలకు వాటంతట అవే గుర్తుకు వచ్చి, పరీక్షలు విజయవంతంగా రాయగలుగుతారు. రాసిన ప్రతి జవాబును ఒక నిమిషం పాటు సరిచూసుకోవాలి.



బాడీ బిల్డర్‌కు అభినందన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఈనెల 23న ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ కాంపి టీషన్‌లో జగ్గయ్య పేటకు చెందిన షేక్ ఇబ్రహీం 75 కేజీల విభాగంలో తృతీయ స్థానం కైవసం చేసుకున్నాడు. ఈ సంద ర్భంగా బుధవారం స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, చిన్నబాబు లను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రహీమ్‌ను అభినందించి, సర్టిఫికెట్స్‌ను, మెడల్స్‌ను అందజేశారు. కోచ్, జిమ్ నిర్వాహకులు కోటి, చంద్రపాల్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

స్కోడా ఆటో ఇండియా 'బ్రాండ్ సూపర్ స్టార్'గా రణవీర్ సింగ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మొట్టమొదటి సబ్-4-మీటర్ ఎస్యువి, ప్రవేశపెట్టిన వెంటనే, స్కోడా ఆటో ఇండియా మరో మైలురాయిని సాధించిందని పవర్ హౌస్ రణ్వీర్ సింగ్ను తన మొట్టమొదటి 'బ్రాండ్ సూపర్ స్టార్'గా ప్రకటించినట్లు స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జనేబాతెలిపారు . ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ప్రపంచ స్థాయి ఉత్పత్తులను ప్రారంభించడం కంటే ఇక్కడ కొత్త యుగంలోకి అడుగుపెట్టడానికి మేము కట్టుబడి ఉన్నామన్నారు. మొదటిసారిగా, స్కోడా ఆటో ఇండియా కోసం రణ్‌వీర్ సింగ్‌ను మొట్టమొదటి 'బ్రాండ్ సూపర్‌స్టార్'గా ప్రకటించినట్లు తెలిపారు. ప్రతిభ, శక్తి కేంద్రంగా, తెరపై, వెలుపల, రణ్వీర్ వ్యక్తిత్వం తమ అభిరుచి, నైతికతను బలంగా ప్రతిబింబిస్తుందన్నారు. స్కోడా ఆటో వైవిధ్యమైన, ఉత్తేజకరమైన ఉత్పత్తి పోర్ట్ఫోలియోను కలిగి ఉందన్నారు. ఇది ఆటోమోటివ్ ఔత్సాహికులకు, పెరుగుతున్న మార్కెట్లో విస్తృత కస్టమర్ బేస్‌ను అందిస్తుందన్నారు. బలమైన వారసత్వం, ఐకానిక్ ఉత్పత్తుల శ్రేణితో, బ్రాండ్ ఆటోమోటివ్ పరిశ్రమలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పుతూనే ఉందని అన్నారు.

ఆధునికంగా శామ్‌సంగ్ స్మార్ట్‌ఫోన్ సర్వీస్ సెంటర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, తన స్మార్ట్‌ఫోన్ కస్టమర్ సర్వీస్ అనుభవాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడానికి సేవా కేంద్రాలను సమూలంగా పునరుద్ధరిస్తోందని సంస్థ రీజినల్ ఇన్చార్జి వరుణ్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ప్రీమియం కస్టమర్ కేర్ మీద బలమైన దృష్టి సారించి, అమ్మకాల తర్వాత అత్యుత్తమైన మద్దతుకు శామ్‌సంగ్ నిబద్ధతను బలోపేతం చేస్తూ, సర్వీస్-టు-సేల్స్ ప్రయాణాన్ని ఏర్పాటు చేయడం లక్ష్యమన్నారు. డైనమిక్ కస్టమర్ బేస్ అభివృద్ధి చెందుతున్న అంచనాలను తీర్చడానికి, శామ్‌సంగ్ తన సేవా కేంద్రాలను ఇంటిగ్రేటెడ్ ఓమ్ని-ఛానల్ అనుభవానికి అనుగుణంగా పునర్నిర్మించిందన్నారు. ఈ ఆధునికీకృత కేంద్రాలు, అధునాతన డిజిటలైజ్డ్ ప్రక్రియలతో కూడినవిగా ఉండి, వేగవంతమైన, సమర్థవంతమైన సేవను అందించడానికి రూపొందించబడ్డాయన్నారు. ఖచ్చితమైన సమస్యను గుర్తించేందుకు అత్యాధునిక డయాగ్నోస్టిక్ సాధనాలను వినియోగించడం ద్వారా, శామ్‌సంగ్ తన సాంకేతిక అగ్రభాగాన్ని మరింత బలోపేతం చేస్తోందని అన్నారు. అప్‌గ్రేడ్ చేయబడిన సర్వీసు కేంద్రాలు సాంప్రదాయ లేఅవుట్లకు భిన్నంగా, అధునాతన డిజైన్‌తో మరింత సౌకర్యవంతమైన లాంజ్ వంటి వాతావరణాన్ని అందిస్తాయన్నారు. ఇందులో అంతర్నిర్మిత వైర్‌లెస్ ఛార్జింగ్ స్టేషన్లు, అల్ట్రా-లార్జ్ డిజిటల్ స్క్రీన్లు తాజా ఉత్పత్తి ఆవిష్కరణలను చూపించి సందర్శకులకు లీనమయ్యే అనుభవాన్ని అందిస్తాయని అన్నారు.

పలుచోట్ల శివరాత్రి ఉత్సవాలు

- అసౌకర్యం లేకుండా అధికారుల ఏర్పాట్లు - కిక్కిరిసిన దేవాలయాలు - యాత్రికుల జల్లు స్నానాలు...
- సేవా సంఘాల ఆధ్వర్యంలో అల్పాహారం, అన్నదానాలు



(వన్‌టౌన్)ఇంద్రకీలాద్రి వద్ద యాత్రికుల రద్దీ

పలుచోట్ల దేవాలయాలు కిక్కిరిసాయి. యాత్రికులు పోటెత్తారు. పుణ్యస్నానాలు, మొక్కులు, పిండ ప్రదానాలతో సందడి నెలకొంది. సేవా సంఘాల వారు అన్నదానాలు, అల్పాహారం, మజ్జిగ, ప్రసాదాల పంపిణీలు చేశారు. అన్ని చోట్లా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా ఇబ్రహీంపట్నంలో పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ భేష్ అని యాత్రికులు హర్షం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్దకు మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా సిఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ బి.లక్ష్మణరావు, సివిల్ ఎస్ఐలు ఫణిదర్, పాపారావు, విజయలక్ష్మి బృందంతో కలిసి ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించారని యాత్రికులు హర్షం వ్యక్తం చేశారు. డ్రోన్‌ను ఉపయోగించి ఎప్పటికప్పుడు ట్రాఫిక్, క్రౌడ్‌ను అంచనా వేసి సిఐ చంద్రశేఖర్ తగిన చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో కొండపల్లి, జి.కొండూరు తదితర ప్రాంతాలకు శివరాత్రి ప్రత్యేక బస్సులు యాత్రికుల కోసం నడిపారు. డివైఎఫ్ఐ, ఫెర్రీ రామాలయం యూత్, ఐద్వా ఫెర్రి కమిటీల ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. స్నాప్లిక ఈవెంట్స్, ఫొటోగ్రఫీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎన్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య పాల్గొని అన్నదానం ప్రారంభించారు. కొండపల్లి మున్సిపాలిటీ బీజేపీ శ్రేణుల, ఎన్ఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు అన్నదానం చేశారు. 40 వేల మందికి పైగా యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. **మైలవరం :** జల్లు, కోనేటి స్నానాలు, చేసి స్వామిని దర్శించుకున్నారు. మహిళలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. మూడు రోజులపాటు సాగే ఈ ఉత్సవాలను మినీ అమెరికాగా పేరుందిన వెల్వడంగ్రామం ప్రవాస భారతీయులు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించటం ఆనవాయితీగా కొనసాగుతుంది. తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన జమలాపురం, వెంకటాపురం, బనిగండ్లపాడు, మధిర, తదితర ప్రాంతాల నుంచి కూడా యాత్రికులు వచ్చారు. సుమారు 70 వేల నుంచి లక్ష వరకు యాత్రికులు వచ్చినట్లు సమాచారం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **వన్‌టౌన్ :** మహాశివరాత్రి సందర్భంగా ప్రతి ఏడాది 25 సంవత్సరాలుగా నూకల మురళి ఫ్రెండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. బుధవారం కెనాల్ రోడ్లో వినాయకుడి గుడి దగ్గర 10 వేల మంది యాత్రికులకు 8 రకాలు ప్రసాదాలు పంపిణీ చేశారు. 37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి చటర్జీ, కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూకల మురళి ఫ్రెండ్స్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వరులకు మంగళగిరి శ్రీ శివభక్త మార్కండేయ వంశీకులు 26వ తేదీ బుధవారం చేనేత పట్టు వస్త్రాలను సమర్పించారు. మంగళగిరిలో భక్త మార్కండేయ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేనేత మగ్గాలపై భక్తిశ్రద్ధలతో ఈ వస్త్రాలను ప్రత్యేకంగా తయారు చేశారు. ఈ సంవత్సరం ప్రధాన కైంకర్య పరులుగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, గుత్తికొండ ధనుంజయరావు చేనేత వస్త్ర నివేదన చేశారు. చేనేత పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమ, గాజులు, విభూది, ఫలపుష్పాలతో ఇంద్రకీలాద్రికి విచ్చేసిన వీరిని ప్రధాన రాజగోపురం వద్ద దేవస్థానం ఉప కార్యనిర్వహణ అధికారి ఎం.రత్నరాజు, సహాయ కార్యనిర్వహణ అధికారి జె.శ్రీనివాసం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి చేనేత ప్రముఖులు దామర్ల వెంకట నరసింహం, తదితరులు పాల్గొన్నారు. **వీరులపాడు :** జుజ్జూరు సంగమేశ్వర స్వామి దేవస్థానంలో, గిరి శిఖరంపై వేంచేసి ఉన్న శ్రీ గిరి రామలింగేశ్వర స్వామి దేవస్థానం స్వామివారికి నూతన వస్త్రాలు అలంకరించి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు యనమదల ప్రసాద్ శర్మ, సాయి ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. నరసరావుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్నమహాశివరాత్రి సందర్భంగా శ్రీ బాల చాముండేశ్వరి దేవి సమేత అమరలింగేశ్వర స్వామి దేవస్థానం నరసింహారావుపాలెం ఆలయ పూజారి శ్రీ కౌశిక నాగసాయి శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. **గంపలగూడెం :** కొత్తపల్లి శివాలయ ప్రాంగణం యాత్రికులతో కిటకిటలాడింది. కృష్ణ, ఖమ్మం జిల్లాలకు చెందిన పలు ప్రాంతాల యాత్రికులు (కట్టలేరు) శివాలయం సమీపాన శ్రీ వేణుగోపాల స్వామి మడుగులో అంటు స్నానాలు చేశారు. ఈ సందర్భంగా, పూల, మైల తెప్పలు నీటి ప్రవాహంలో వదిలారు. ఆలయ చైర్మన్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి, కమిటీ పర్యవేక్షించింది. ఈ ఉత్సవాలను ఎంపిడిఒ పివిఎస్ నాగేశ్వరరావు పరిశీలించగా, ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నెమలి, ఊటుకూరు, పెనుగొలను, గోసవీడు, గంపలగూడెం గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో శివ పార్వతుల కళ్యాణం జరిగింది. **జగ్గయ్యపేట :** మండలంలోని ముక్త్యాలలో గల శ్రీ కోటిలింగ హరిహర మహాక్షేత్రంలో బుధవారం మహాశివరాత్రి పురస్కరించుకొని శ్రీ భవాని ముక్తేశ్వర స్వామి ఆలయంలో శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట ఖమ్మం జిల్లాల నుండి సైతం యాత్రికులు తెల్లవారుజాము నుండే కృష్ణానదిలో స్థానమాచరించి భవాని ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కెసిపి సిమెంట్ కర్మాగారం యాజమాన్యం యాత్రికులకు అల్పాహారం, మజ్జిగ, భోజన వసతులను ఏర్పాటు చేశారు. ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్య యంత్రాంగంతో పర్యవేక్షణలో ఉన్నారు. సేవా సంఘాల వారు అల్పాహారం, భోజనం, మంచినీరు, మజ్జిగలను అందించారు. జగ్గయ్యపేట ఆర్‌టిసి డిపో వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. వాహనాలను ముత్యాల గ్రామ సమీపంలోని సీమ పందుల పెంపకం కద్రం వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు. సర్కిల్ పరిధిలో గల పోలీసు సిబ్బంది జగ్గయ్యపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది యాత్రికులకు ప్రత్యేక నిఘా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. **కంచికచర్ల :** కంచికచర్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బుధవారం ఉదయాన్నే మండలంలోని చెవిటికల్లు ఘాట్ వద్ద కృష్ణానదిలో శివరాత్రి స్నానాలకు తరలివెళ్లారు. చెవిటికల్లు వద్ద నదీనీటి పాయ పెద్దగా లేకపోవటంతో అధికారులు జల్లు స్నాలకు ఏర్పాట్లు చేశారు. జల్లుస్నానం అనంతరం పూర్వీకులకు పిండ ప్రదానం చేశారు. కొందరు యాత్రీకులు కృష్ణానదిలో కాలినడకన అమరావతికి వెళ్లారు. **నందిగామ :**కోనయపాలెం, జగ్గయ్యపేట నియోజకవర్గం నందిగామ మండలం కూడలిలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య దర్శించుకున్నారు. **వత్సవాయి :** ఇందుకుపల్లి, లింగాల రామలింగేశ్వర, భీమవరం మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద యాత్రికులు దర్శించుకున్నారు. లింగాలలో అన్నదానం చేపట్టారు. ఆట వస్తువులు, రంగుల రాట్నాలు ఏర్పాటు చేయటంతో లింగాల దేవాలయం వైపు యాత్రికులు మొగ్గు చూపారు. జల్లుల స్నానం ఏర్పాట్లు చేశారు.



ఇబ్రహీంపట్నం, ఫెర్రీ వద్ద రద్దీ



మైలవరంలో జల్లు స్నానాలు



ఇబ్రహీంపట్నంలో అన్నదానాలు



గంపలగూడెంలో స్నానాలాచరిస్తున్న యాత్రికులు



జగ్గయ్యపేటలో యాత్రికుల రద్దీ



కంచికచర్లలో జల్లు స్నానాలు